ప్రజాశక్తి

గురువారం 23 జనవరి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



గన్నవరం విమానాశ్రయంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

కమ్మేసిన పొగమంచు

●పలు విమానాలు రద్దు ●మరికొన్ని ఆలస్యం

ప్రజాశక్తి - గన్నవరం

పొగ మంచు కారణంగా బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి రావాల్సిన పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తెల్లవారుజామున 4 నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు పొగమంచు కురుస్తూనే ఉంది. దీంతో బెంగళూరు, ఢిల్లీ నుంచి రావాల్సిన విమాన సర్వీసులను ఆయా విమాన సర్వీసుల యాజమాన్యాలు రద్దు చేశాయి. అలాగే హైదరాబాద్, చెన్నై విమానాలు సైతం ఆలస్యంగా వచ్చాయి. కొన్ని రోజులుగా పొగ మంచు, చలితీవ్రత పెరిగిపోయింది. రెండు రోజులుగా పొగమంచు కమ్మేస్తోంది. దీంతో పలు విమాన సర్వీసులు రద్దు కావడం, మరికొన్ని ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా

సురక్షా కమిటీలు

●హోం మంత్రి అనిత ●సురక్షా కమిటీలు, సిసి కెమెరాలు, ఈగల్ వెహికల్స్‌కు ప్రారంభోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, విజయవాడ : ప్రజా భద్రతే లక్ష్యంగా సురక్షా కమిటీలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షా కమిటీలను, వెయ్యి సిసి కెమెరాలను, ఈగల్ వెహికల్స్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత, డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావు బుధవారం ప్రారంభించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సురక్షా కమిటీ చొప్పున ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రేట్ పరిధిలో మొత్తం 28 సురక్ష కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ (మిగతా 2లో)

ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి

'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు'పై సదస్సులో వక్తలు

వార్త మెయిన్‌లో



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

పంట రుణాలకు పటిష్ఠ ప్రణాళిక

కెడిసిసిబి సాంకేతిక కమిటీలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ



జిల్లాలో వివిధ పంటల సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంట రుణాల మంజూరుకు మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళిక రూపొందిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. కష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఎన్‌టిఆర్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల రైతులు, బ్యాంకర్లు తదితరులు హాజరుకాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగు వ్యయం, పంటల దిగుబడి విలువ, రుణ పరిమితి వివరాలను పరిశీలించి.. తదుపరి 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాగు ఖర్చు, దిగుబడి విలువ అంచనాల ఆధారంగా నిర్ణయించాల్సిన రుణ పరిమితిపై వ్యవసాయం, ఉద్యాన, మత్స్య తదితర శాఖల అధికారులు తమ అభిప్రాయాలను సమావేశం ముందుంచారు. అదేవిధంగా రైతులు వివిధ పంటల సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కోతలు తదితరాలకు అయ్యే ఖర్చుల వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2025-26కు గాను వరికి రుణ పరిమితి రూ.46 వేలు, మిరప (డ్రై)కు రూ.1.10 లక్షలు, మిర్చి (ఇరిగేటెడ్)కు రూ.1.15 లక్షలు, మామిడికి రూ.42,500, ఆయిల్‌పామ్‌కు రూ.75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.60 వేలు ఇలా వివిధ పంటలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రుణపరిమితిని ప్రతిపాదించినట్లు వివరించారు. రైతుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని గతేడాది కంటే అధిక రుణ పరిమితిని ప్రతిపాదించినట్లు తెలిపారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)కి అదనంగా 30 శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశముందన్నారు. ఈసమావేశంలో కష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జీఎం ఎ.రంగబాబు, అసిస్టెంట్ ఎల్‌డీఎం ఎం.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ప్రగతిశీల రైతులు కె.నరసింహారావు, పి.నాగేశ్వరరావు, ఎ.అజయ్ కుమార్, పీఎస్‌ఆర్ ప్రసాద్, ఎం.రాజశేఖర్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐవోబీ, యూకో తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నేడు సూర్యఘర్‌పై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - విజయవాడ : పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఈనెల 23న ప్రత్యేక ర్యాలీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్‌పై కలెక్టర్ లక్ష్మీశ.. వెండర్లు, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీలోగా మరో 1,100 యూనిట్ల గ్రౌండింగ్‌కు సిద్ధం కావాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులు, వెండర్లు సమన్వయంతో పనిచేసి యూనిట్ల ప్రారంభానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలన్నారు. పథకంపై గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా అవగాహన ర్యాలీల నిర్వహణకు ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ర్యాలీల్లో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. అదేవిధంగా కాలేజీ, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మానవ హారాలతో పథకంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు కూడా ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సచివాలయ సిబ్బందికి పోస్టర్లు, బ్యానర్లు అందజేయాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద ఆదర్శ గ్రామపంచాయతీలుగా ఎంపికైన పరిటాల (కంచికచర్ల), వెల్వడం (మైలవరం)బీ బూదవాడ, ఎస్ఎం పేట (జగ్గయ్యపేట), కంభంపాడు (ఎ.కొండూరు)లో 100 శాతం కనెక్షన్ల ఏర్పాటుకు అధికారులు.. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీ మోహన్, ఇన్‌స్టలేషన్స్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి అనిత, చిత్రంలో డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు, సిపి ఎస్.వి.రాజశేఖరబాబు తదితరులు

ప్రజల భద్రతే లక్ష్యంగా సురక్షా కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన ప్రజలకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు సురక్ష కోర్ కమిటీ సభ్యులను, సురక్షా కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ కుదరవల్లి వెంకట నర్సయ్య తదితరులను సత్కరించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రజల భద్రత, రక్షణకు పోలీసు వ్యవస్థ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని మంచి ఫలితాలను సాధిస్తున్నారన్నారు. ఓవైపు డ్రోన్లు, మరోవైపు సిసి కెమెరాలతో నిందితుల కదలికలపై నిఘా పెట్టడం అభినందనీయమన్నారు. పోలీసులు ప్రజల రక్షణకు, వారి భద్రతకు కృషి చేయాలని అన్నారు. చాలామందికి పోలీసులంటే భయంతోపాటు కొంత నిరుత్సాహం ఉందన్నారు. అయితే ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవల ద్వారా ప్రజలకు దగ్గర కావాలని ఆకాంక్షించారు. డిజిపి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సిసి కెమెరాల ద్వారా నేరాల నియంత్రణ జరుగుతుందన్నారు. మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రంలో మొత్తం లక్ష కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సాంకేతికతను వాడుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. డ్రోన్, కెమెరాల ద్వారా ఇప్పటికే మంచి ఫలితాలు సాధించామన్నారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ విజయవాడలో ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలను సిపి రాజశేఖర్ బాబు బాగా అమలు చేస్తున్నారని, వరదల సమయంలో ప్రజలకు అనేక సేవలందంచారని గుర్తుచేశారు. ఈసేవలు రాష్ట్రవ్యాప్తంగా వుండాలని ఆకాంక్షించారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ వంద శాతం మంది ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా వారికి అవగాహన కల్పిస్తామని చెప్పారు. సిసి కెమెరాల పర్యవేక్షణకు మరో 250 మంది ముందుకు వచ్చిన సేఫ్టీ అంబాసిడర్లను సిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు బొండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణ ప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ తాతాయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.



సురక్షా కమిటీల ఎన్‌టిఆర్ జిల్లా కోఆర్డినేటర్ కుదరవల్లి వెంకట నరసయ్యను సత్కరిస్తున్న మంత్రి వంగలపూడి అనిత, డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), సిపి ఎస్.వి.రాజశేఖరబాబు

రాజ్యలక్ష్మికి ఎఎన్‌యు పిహెచ్‌డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త తిరుమల గుడిమెళ్ళ రాజ్యలక్ష్మికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పిహెచ్‌డి పట్టా ప్రకటించింది. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణంరాజు పర్యవేక్షణలో ప్రణవసదశం విష్ణుచిత్తుని తిరుప్పల్లాండు విష్ణుప్రబంధం అంశంపై ఆమె సమర్పించిన సిద్ధాంతవ్యాసానికి వర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రకటించింది.

మోటూరులో గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినీలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండలం మోటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మెల్యే రాము ముందుగా గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించిన అనంతరం తరగతుల వారీగా తిరుగుతూ విద్యార్థినిలతో నేరుగా మాట్లాడారు. వసతి గహంలో మెనూ, ఇతర వసతులపై ఆరా తీశారు. డిజిటల్ బోర్డుల ద్వారా అధ్యాపకులు అందిస్తున్న బోధనలను విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఆసక్తిగా విన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినిలకు ఎమ్మెల్యే ఆశీస్సులు అందించారు. అనంతరం గురుకులం వసతిగహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులపై అసంతప్తి వ్యక్తం చేసి పరిస్థితులను చక్కదిద్దాలంటూ ప్రిన్సిపాల్ సంజీవిని దేవినీ సున్నితంగా హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మోటూఎఱ పంచాయతీ కార్యదర్శి పి.జనార్ధన్, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి మోపిదేవి : షుగర్ వ్యాధితో బాధపడుతూ రెండు కాళ్లు తొలగించాల్సిన దుస్థితికి చేరిన నిర్భాగ్య రాలికి అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమా ఐదు వేలరూపాయల ఆర్థిక సహాయం బుధవారం అందించారు. మోపిదేవి ప్రశాంత్ నగర్‌కు చెందిన కాకి నాగమణిని ఆమె నివాసం వద్ద పరామర్శించి సాయం అందించారు. మానవతా దకృథంతో దాతలు అందిస్తున్న సహకారానికి నాగమణి కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఆమె భర్త గొరుముచ్చు మోని, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్వహణకు అంచనాలు : కలెక్టర్



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వచ్చే ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో కాలువల డ్రైన్ల నిర్వహణ పనులు ముందుగా చేపట్టేందుకు అవసరమైన అంచనాలు రూపొందించి వేసవిలోనే పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులు పంటల సాగుకు ప్రయోజనకరంగా ప్రతి ఏడాది జూన్ మాసంలో కాలువలకు సాగునీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈలోగా కాలువలు డ్రెయిన్ల లో గుర్రపు డెక్క, తొలగింపు, నిర్వహణ పనులు చేపట్టుటకు అంచనాలు రూపొందించాలని, ఫిబ్రవరి 3 లోగా ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని, తద్వారా ఏప్రిల్ మాసంలోగా పనులు చేపట్టుటకు అనుమతులు, మంజూరులు తీసుకొని మే మాసంలో పనులు చేపట్టి పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రైన్లు లో తొలగించిన గుర్రపుడెక్క, తూడు ఒకే చోట వేసి కంపోస్ట్ గా తయారయ్యే విధంగా, దీనిని రైతులు తమ పొలాల్లో వినియోగించుకునేలా చేసినట్లయితే రైతులకు ఫెర్టిలైజర్స్ వ్యయం తగ్గి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇరిగేషన్ సూపరింటెంట్ ఇంజనీర్ మోహన్ రావు, డ్రైనేజీ గోపీనాథ్, ఇరిగేషన్ కేఈ డివిజన్ ఈఈ కే. బాబు, కేసి డివిజన్ ఈఈ రవికిరణ్ పాల్గొన్నారు.



తారురోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-కోడూరు : గ్రామీణ ప్రాంతాల మధ్య రహదారుల అభివద్ధికి కషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కోడూరు మండలం మందపాకల నుంచి ఇరాలి వరకు పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పర్యవేక్షణలో పీ.ఎం.జీ.ఎస్.వై -3 నిధులు 3,88 కోట్ల రూపాయలతో ఐదు కిలోమీటర్లు పొడవున నిర్మిస్తున్న నూతన తారు రోడ్డును ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందపాకల నుంచి చింతకోళ్ల వరకూ ఉన్న రోడ్డును తారు రోడ్డుగా అభివద్ధి చేస్తామని, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. చింతకోళ్ల వరకు ఉన్న ఈ రోడ్డును ఇరాలి వరకూ నూతన రోడ్డుగా పొడిగించి రామకష్ణాపురం ప్రధాన రహదారికి కలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈఈ పగడాల సురేష్ బాబు, పీఆర్ ప్రాజెక్టు జేఈ నందిపాటి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలో రూ. 1.10 కోట్ల అభివృద్ధి పనులు : సర్పంచ్



ప్రజాశక్తి-గన్నవరం : గ్రామాభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసు (వాసు)తెలిపారు. ఆయన ప్రజాశక్తి తో మాట్లాడుతూ అభివద్ధిని ప్రజలకు చేరువ చేయడం ద్వారా ప్రజల ఋణం తీర్చుకుంటామని చెప్పారు. ఈ ఏడాదిలో రూ. 1.10 వివిధ అభివద్ధి పనులు చేస్తున్నామని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో నిధులు రాబట్టడంతో పాటు దాతల సహకారం ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీలో జరిగిన అభివద్ధి పనుల వివరాల్లోకి వెళితే... గ్రామ పెద్దలు, దాతల సహకారం రూ. 40 లక్షలతో స్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివద్ధి చేయడం జరుగుతోంది. గ్రామంలో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. 25 లక్షలతో పక్కా డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. నాలుగు లక్షలతో వాగుపై కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. రూ. 11 లక్షలతో సచివాలయం పరిధిలో గోతులను మట్టితో పోల్చడంతోపాటు వాగును బాగు చేశారు. గ్రామంలో రెండు బోర్ వెల్స్ రూ. 5లక్షలతో నిర్మాణం జరిగింది. సూరంపల్లి అడ్డరోడ్డు వద్ద నుండి సుగాలిపేట వరకు లైటింగ్ ఏర్పాటుతోపాటు సీసీ కెమెరాలు మూడు లక్షలతో ఏర్పాటు చేశారు. మరో కోటి రూపాయలతో పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని వివరించారు. అదే విధంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ నుండి నిధులు రాబట్టేందుకు కషి చేస్తున్నాం. గ్రామం లో దాతల సహకారం తీసుకుని, ఆదాయం పెంపుకు ప్రత్యేక ప్రణాళికలు కార్యదర్శి లక్ష్మణరావు రూపొందిస్తున్నట్లు వివరించారు.

చెత్త సేకరించే పుష్‌కార్ట్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : స్వచ్ఛ గుడివాడ రూపకల్పన కోసం పురపాలక సంఘం చేస్తున్న కృషిలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూ.24 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన 100 పుష్ కార్ట్స్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మట్లాడుతూ గుడివాడ అభివద్ధి స్వచ్ఛతకు ప్రభుత్వం పురపాలక సంఘం ఎంత కృషి చేస్తున్న ప్రజల భాగస్వామ్యం లేకపోతే ఫలితాలు సాధించలేమన్నారు. గుడివాడ రూపకల్పనకు రానున్న రోజుల్లో అనేక వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పుష్ కార్ట్‌లో 6 వందల లీటర్ల సామర్థ్యం గల నాలుగు డస్ట్ బిన్లు ఏర్పాటు చేశామని, నూతన పుష్ కార్ట్స్ ద్వారా నేటి నుంచి 36 వార్డుల పరిధిలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం రామకష్ణాపురంలో బుధవారం అద్దంకి ప్రభుదాస్ కుటుంబాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు అద్దంకి పాండురంగారావు సోదరుడు ప్రభుదాస్ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుదాస్ చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. ప్రభుదాస్ మతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

నేడు తురకా మంగమ్మ సంస్మరణ సభ

ప్రజాశక్తి-మోపిదేవి : పేదల కోసం దున్నేవాడికే భూమి కోసం చల్లపల్లి జమీందారులతో పోరాడిన ఘన చరిత్ర కలిగిన మోపిదేవి లంక మాజీ సర్పంచ్ తురకా మంగమ్మ సంస్మరణ సభ గురువారం మోపిదేవిలంకలో జరగనుంది. తురకా మంగమ్మతో పాటు పోచగాని లంకకు చెందిన ఆమె సోదరి ముక్కుదోశీ తులమ్మ లో కలిసి 1981లో భూముల కోసం పోరాడి పోలీసుల నిర్బంధాలతో 12 రోజుల జైలు జీవితం గడిపారు. తదనంతర కాలంలో మంగమ్మ కుటుంబం వైసీపీలో సానుభూతిపరులుగా కొనసాగుతూ గత హయాంలో సర్పంచిగా పనిచేశారు. గ్రామ అభివద్ధికి మంగమ్మ విశేష కషి చేశారని స్థానికులు కొనియాడుతున్నారు. జనవరి మొదటి వారంలో మంగమ్మ తుది శ్వాస విడిచారు.గురువారం జరిగే జరగనున్న సంస్మరణ కార్యక్రమానికి ఆమె అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కుమారులు కుమార్తెలు మనవళు విజ్ఞప్తి చేశారు

కళాశాల అభివృద్ధికి నిధుల మంజూరు



.ప్రజాశక్తి-బంటుమిల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బంటుమిల్లికి ప్రధానమంత్రి ఉచ్ఛతార్ శిక్షా అభియాన్) పథకం కింద ఐదు కోట్ల రూపాయలు మంజూరైటన్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూరగం జగన్మోహనరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో కళాశాలలోని వసతులు పూర్తి స్థాయిలో మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇందులో మూడు కోట్ల రూపాయలతో కళాశాల ప్రహరీ,నూతన భవనాలు,సెమినార్ హాలు, అంతర్గత రోడ్లు స్టాఫ్,బాలుర టాయిలెట్స్,సైకిల్ షెడ్ల నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఒక కోటి రూపాయల వ్యయంతో కళాశాలకు కావలసిన కంప్యూటర్లు, సామాగ్రి,ఇతర పరికరాలు ఏర్పాటు చేసుకుంటామన్నారు. కోటి రూపాయల వ్యయంతో ప్రస్తుతం ఉన్న భవనాన్ని పూర్తిస్థాయిలో అధునాతనంగా మార్చడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రైతుల మేలుకే సాగునీటి సంఘాల ఏర్పాటు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని, ఆ దిశగా రైతులకు మేలు చేకూర్చే సాగునీటి సంఘాలను ప్రవేశపెట్టామని ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ఇరిగేషన్ బంగ్లాలో. కౌతవరం డివిజన్ ,కౌతవరం సెక్షన్ల పరిధిలోని డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్, పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న డిసి చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు ఇరిగేషన్ కాలువలపై జంగిల్ క్లియరెన్స్, డీసిల్ట్, ఇతర సమస్యలను ఎమ్మెల్యేలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలపై... అధికారులతో ఎమ్మెల్యేలు మాట్లాడారు. రాబోవు రోజుల్లో ఇరిగేషన్ పనులు వంద శాతం కచ్చితత్వంగా జరిగేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మిల్క్ డైరెక్టర్ అజ్జా నగేష్, ఇరిగేషన్ ఇఇ కె. బాబు, మచిలీపట్నం డిఇ కిరణ్ బాబు, డ్రైనేజ్ డిఇ కుమార్, కౌతవరం డిఇ శ్రీను, ఏఈలు నిర్మల, రామ్ తులసి,నాగేశ్వరరావు, గుడివాడ, పెడన పరిధిలోని డిసి చైర్మన్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యం

రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకెళ్తోందని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. స్థానిక మేరీస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని మానవ వనరుల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో నూతన విద్యా విధానంపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ప్రాంతీయ సదస్సులో డైరెక్టర్ విజయ రామరాజు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు మానవ వనరుల విభాగంలో భాగస్వామ్యం అయిన మేధావి వర్గంతో అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులు ఉన్నచోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి జిల్లా పరిపాలన యంత్రాంగం ప్రమేయం చాలా అవసరమన్నారు. అందుకు తగిన విధంగా ఆయా సమన్వయ శాఖల అధికారులతో వర్క్ షాప్ ఏర్పా టు చేశామన్నారు. నూతన ప్రతిపాదిత విద్యా విధానంలో విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకొని శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలల ఉన్నతీకరణ చేస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు, ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 25 పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీటిలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారి అభిప్రాయాలను సమీకరించి ఒక సమగ్ర అధ్యయన నివేదిక రూపొందిస్తామని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు ప్రతి పాదనలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, డా. జి.లక్ష్మీశ, పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ జి.నాగమణి, ఎన్టీఆర్ కృష్ణ జిల్లాల డీఈవోలు యు.వి. సుబ్బారావు, పి.వి.జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సిస్టమ్స్ ఇంజినీరింగ్ సమ్మిట్



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచే దిశగా ఎవ్రొటానిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ అధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సిస్టమ్స్ ఇంజనీరింగ్ సమ్మిట్-2025 జరుగుతుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకష్ణ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త విధానంలో సిస్టమ్స్ పని తీరు గురుంచి విద్యా విధానంలో రానున్న మార్పుల గురించి సిస్టమ్స్ ఇంజనీరింగ్ నిపుణులు రెండు రోజుల సదస్సులో వివరిస్తారని అన్నారు. అలాగే రానున్న కాలంలో రాష్ట్రంలోని కొన్ని విద్యా సంస్థలలో సిస్టమ్స్ ఇంజనీరింగ్ కోర్సు రానున్నది, ఈ విద్యా విధానం అలాగే వివిధ రంగాలలో సిస్టమ్స్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత గురించి తెలిపచేస్తారని అన్నారు. ఈ నెల 23 వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి బోయింగ్ నిపుణులు డాక్టర్ వై.యోగానంద తో పాటు పలువురు విద్యా వేత్తలు వివిధ విశ్వవిద్యాలయాల నిపుణులు హాజరుకానున్నారని అన్నారు.దేశ వ్యాప్తంగా సుమారు 450 కి పైగా. హాజరు కానున్నారని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ బి. సంబిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఎస్.భవాని శంకర్ పాల్గొన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి



ప్రజాశక్తి-కంచికచర్ల: సమాజంలో కుష్టు వ్యాధిని సమూలంగా పారద్రోలేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కుష్టు వ్యాధి నిర్మూలన స్టేట్ జాయింట్ డైరెక్టర్ దేవప్రసాద్ కోరారు. కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుచున్న కుష్ఠు వ్యాధి నిర్మూలన ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణ కార్యక్రమమును బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలన విభాగం స్టేట్ జాయింట్ డైరెక్టర్ దేవప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా దేవప్రసాద్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి రెండు వరకు కొనసాగనున్న కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రిపోర్టులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. మధురిమ, సూపర్వైజర్ జీవి రాఘవేంద్రరావు, బి. సౌరీలమ్మ పాల్గొన్నారు.

క్రెటా ఈవీ కారు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజధాని ప్రాంతంలోని విజయవాడ నగరం శరవేగంగా అభివద్ధి చెందుతుంది. నగరానికి ప్రజల సౌకర్యార్థం కొత్త వాహనాలు అందుబాటులోకి రావటం ఎంతో సంతోషంగా వుందని ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. ఎనికేపాడు లోని లక్కీ హ్యుండాయ్ షో రూమ్ లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎమ్.డి.అహ్మద్ షరీఫ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తో కలిసి హ్యుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కార్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఈవీ వాహనాల వైపు చూస్తుందని... ఈవీ వాహనాల వాడకం పెరిగితే కాలుష్యం తగ్గుతుందన్నారు. అలాగే వినియోగదారులకు నిర్వహణ భారం కూడా తగ్గుతుందన్నారు. విజయవాడ గ్రీన్ ఎనర్జీ సిస్టమ్స్ తో అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హ్యుండాయ్ షో రూమ్ చైర్మన్ సందీప్ ఉస్మాన్, సి.జి.ఎమ్. రోహిణ్ కుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



'వి' అన్‌లిమిటెడ్ డేటా ప్లాన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి, మొట్టమొదటి నిజమైన అపరిమిత డేటా ప్లాన్ నాన్‌స్టాప్ హీరోను ప్రారంభించినట్లు సంస్థ ఇంచార్జ్ ఎం.నరేష్ కుమార్ తెలిపారు. నగరంలోని వి స్టోర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రీపెయిడ్ కస్టమర్లకు డేటా కోటా అయిపోవడం అనే సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడిన నాన్‌స్టాప్ హీరో ప్లాన్ మొత్తం చెల్లుబాటు వ్యవధిలో ఆందోళన లేని డేటా అనుభవాన్ని అందిస్తుందని అన్నారు. కేవలం రూ.365తో ప్రారంభమయ్యే నాన్‌స్టాప్ హీరో ప్లాన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

99 శాతం అర్జీలు పరిష్కారం



ప్రజాశక్తి-గంపలగూడెం: గత డిసెంబర్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను 99 శాతం పరిష్కరించినట్లు తహసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 595 అర్జీలకు గాను, ఇప్పటికే 589 అర్జీలకు పరిష్కారం చూపినట్లు వివరించారు. దీర్ఘకాలికంగా సమస్యల వలయంలో మరో 6 అర్జీలు ఉన్నాయని, వాటిని సైతం 2,3 రోజుల్లో క్లియర్ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించడం శుభ నామంగా పేర్కొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన



గంపలగూడెంలో...

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రజలకు కల్తీ లేని ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ సిహెచ్. దేవదత్తు పేర్కొన్నారు. బుధవారం పెద్ద కొమెర సచివాలయం వద్ద రైతులతో సహజ వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటయింది. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ, సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన లేకపోవడంతో క్రిమిసంహారక మందులతో కూడిన ఆహారాన్ని ప్రజలు తింటున్నారని, దీనితో అనారోగ్యం పాలు అవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. సహజ వ్యవసాయం వలన క్రిమిసంహారక అవశేషాలు లేని ఆహార పదార్థాలను అందరికీ అందుబాటులో తేవడమే ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్.పి.ఓ లను ఏర్పాటు చేసి గ్రామాల్లో ఉన్న సాగు భూమిలో 25 శాతం భూమిని సహజ వ్యవసాయం చేయించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు దత్తు తెలిపారు. ఈ విషయాలపై స్థానిక రైతాంగం ప్రత్యేక దష్టిని సారించాలని కోరారు. **ప్రజాశక్తి-తిరువూరు:** సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నందిస్తుందని రాష్ట్ర ఆర్గా నిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్తు అన్నారు. తిరువూరు నియోజకవర్గం లోని వ్యవసాయ శాఖాధికారులతో బుధవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ ప్రయోజనాలను వివరించారు. నియోజకవర్గంలో కనీసం 2900 ఎకరాలలో సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారిణి విజ యకుమారి, తిరువూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జీ కెనడీ, తిరువూరు, గంపలగూ డెం, ఏ.కొండూరు మండల వ్యవసాయా ధికారులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని జేఆర్సి - విశ్వభారతి డిగ్రీ కాలేజీ తృతీయ సంవత్సరం విద్యార్థులు 5వ సెమిస్టర్ ఫలితాలలో యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. సిహెచ్ వెంకట హర్షిని బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 739/800 మార్కులు, పి గుణశేఖర్ బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 810/900 మార్కులు, ఎండి అయేషా బీకాం కంప్యూటర్స్‌లో 498/600 మార్కులు సాధించారు. యూనివర్సిటీ టాపర్స్‌గా గణితంలో చింతల మానస 100/100, చుండూరు వెంకట హర్షిని 100/100, ఫిజిక్స్‌లో చుండూరు వెంకట హర్షిని 100/100 మార్కులతో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్య ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కెఎన్ రమేష్, జె తిరుపతిరావు అభినందించారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని కే అగ్రహారం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట వ్యవసాయ ఏడిఏ భవాని మాట్లాడుతూ రైతులు వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హెచ్ ఓ వర్ధిని, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఏడి భవాని, ఏవో వరలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో లైసెన్సులు, స్టాక్ రికార్డులను, బిల్ బుక్ లను తనిఖీ చేశారు. **రెడ్డిగూడెం:** మండలంలోని ముచ్చనపల్లి, మద్దులపర్వ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎన్టీఆర్ వారి ఆదేశాల మేరకు అగ్రి కనెక్ట్ ప్లస్ ప్రోగ్రాం ద్వారా స్కూల్ విద్యార్థులకు వ్యవసాయ మరియు అనుబంధ శాఖలపై అవగాహన కార్యక్రమంలో ముచ్చినపల్లి ఎంపీయుపి స్కూల్ 7, 8 తరగతులు విద్యార్థులకు వ్యవసాయం మరియు పశుసంవర్ధక పథకాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా వరి, మొక్కజొన్న పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో విసన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కే శశికళ, మండల వ్యవసాయ అధికారి ఆర్ సురేష్, స్కూల్ హెచ్ఎం సిహెచ్. నాగేశ్వరరావు, ఏఈఓ పవన్ కుమార్ పాల్గొన్నారు. **గంపలగూడెం:** పంటల సాగు సమయంలో రైతులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి కాపాడుకున్నట్లయితే మంచి దిగుబడులు వస్తాయని తిరువూరు ఏడిఏ కెనడీ పేర్కొన్నారు. బుధవారం పెనుగొలను లో ఒక రైతు పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సాగు చేస్తున్న మొక్కజొన్నను పరిశీలించి, పలు సూచనలు చేశారు. **తిరువూరు:** వ్యవసాయంతో పాటు పాడిని కూడా పెంచినట్లై తే రైతులు లాభదాయకం పొందుతారని జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి తెలిపారు. తిరువూరు మండలంలోని చౌటపల్లి గ్రామం లో బుధవారం ఆమె పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతుతో కలిసి క్షేత్రస్థాయిలో నిర్వహించారు. పాడి గేదలు ఉన్నట్లయితే వాటి ఎరువు పంటలకు ఉపయోగించుకుని అదనపు ఆదా యం పొందవచ్చు అన్నారు. రైతులు తమకు ఉన్న పొలంలో కొంత మేరకు ప్రకతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం చేస్తూ రసాయన ఎరువుల రహిత ఆరోగ్యకరమైన పంటను పండించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మ, పశు వైద్యాధికారిణి స్వప్న, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎం. సువర్ణ రాజు, వెటర్నరీ అసిస్టెంట్ వీరబాబు పాల్గొన్నారు. **విస్సన్నపేట:** తాతకుంట్ల గ్రామంలో అగ్రి కనెక్ట్ ప్లస్ పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎం పి యు పి స్కూల్ విద్యార్థులు క్షేత్ర పరిశీలనకు వరి, మామిడి మరియు మొక్కజొన్న పొలాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, నాయకులు వీరమాచనేని కృష్ణ ప్రసాద్, దమ్మలపాటి సాంబశివరావు, గ్రామ ఉద్యాన సహాయకులు రవి పాల్గొన్నారు.



విస్సన్నపేటలో...

గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో

మౌలిక వసతులు కరువు

- ఐదేళ్లుగా కొత్త భవనానికి నిధులు మంజూరు చేయని వైనం
- స్పెషలిస్టు డాక్టర్లు లేక రోగుల ఇబ్బందులు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగేనా అని ప్రజలు అంటున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆసుపత్రిలో మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనం కారిపోతుంది. మౌలిక వసతులు లేకపోవడంతో ఒక గదిలో ముగ్గురు డాక్టర్లు ఉండి రోగులను పరీక్షించాల్సి వస్తుంది. డెంటల్ డాక్టర్ ఉన్న సదుపాయాలు లేకపోవడంతో వైద్యం అందడం లేదు. ఓపి బ్లాక్, వైద్యులకు ఐదు గదులు, ఫార్మసీ బ్లాక్ కోసం ఒక భవనం కట్టాల్సి ఉంది. దీనికోసం నిధులు శాంక్షన్ చేయాలని ఐదేళ్లుగా అడుగుతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని రోగులు చెబుతున్నారు. 40 పడకల ఆసుపత్రి కావడంతో ఆర్థోపెడిక్, గుండె సంబంధిత స్పెషలిస్టులు ఉండడం లేదు. ఆదివారం ఏదైనా ఎమర్జెన్సీ కేసు వస్తే అప్పుడు డాక్టర్ కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి. ప్రతిరోజు రాత్రి వేళలో కూడా ఇదే పరిస్థితి.ఈ క్రమంలో సిబ్బంది డాక్టర్లుగా మారి ప్రాథమిక వైద్యం చేస్తున్నారు. సాధారణమైన రోజుల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకే డాక్టర్లు ఉంటారు. ఆ తర్వాత చూద్దామన్నా డాక్టర్లు కనిపించరు, రాత్రివేళ ఏదైనా కేసు వస్తే వెంటనే విజయవాడ తీసుకువెళ్లిపోమని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం చిన్న చూపు వల్ల ఈ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఆసుపత్రి అభివద్ధికి రూపాయి కూడా కేటాయించలేదు. ఆసుపత్రి బడ్జెట్ ను కూడా వేరే వాటికి తరలించారు. దీనికి తోడు ఈ ఆసుపత్రిలో స్పెషలిస్టులు లేరు. సాధారణ వైద్యులతోనే నడక సాగుతోంది. ఇది 40 పడకల ఆసుపత్రి. నిత్యం జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన రోగులను ఇక్కడకు తీసుకువస్తారు. ఆర్థోపెడిక్ డాక్టర్ లేడు. దంత వైద్యులు ఉన్నా లేనట్లే. ఎందుకంటే పరికరాలు లేవు, మందులు లేవు. దీంతో డాక్టర్ ఖాళీగా ఉండాల్సి వస్తుంది. ఆదేవిధంగా గన్నవరం మండలంలోని పది గ్రామాల నుంచి వైద్యం కోసం జనం రోజు ఆసుపత్రికి వస్తారు. ఓపి 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అందరూ సాధారణమైన డాక్టర్లే. స్పెషలిస్టులు లేరు. నార్మల్ కాన్పులు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వరకే ఈ ఆసుపత్రి పరిమితమైంది. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే వెంటనే అంబులెన్స్ లో విజయవాడ పంపేస్తున్నారు.. ఇక సాధారణ రోగుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, సర్జన్ పోస్టులు కావాల్సి ఉంది. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఇంకా విచిత్రం ఉంటే ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లకు చూడడానికి రూములు కూడా లేని పరిస్థితి ఇక్కడ ఉంది. ఇబ్బందులతో రోగులను చూసి పంపుతున్నారు డాక్టర్లు. మౌలిక వసతుల కల్పన కోసం కొత్త భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం తక్షణంగా ఉంది. అందుకోసం కోటి రూపాయలు కావాలని గతంలో ప్రతిపాదించారు. దీనికి తోడు పెద్ద ఎక్సరే మిషన్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆదివారం డాక్టర్లు రాకపోవడంతో సిబ్బంది డాక్టర్లు గా మారి రోగులకు చికిత్సలు చేసి పంపుతున్నారు. ఇప్పటికైనా టిడిపి ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్టులతోపాటు మౌలిక వస తులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రభుత్వం నిధులు కేటాయించాలి..
సూరగాని సాంబశివరావు, సిపిఎం

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. మంచినీటి సదుపాయం కోసం మరో బోర్వెల్ ను నిర్మించాలి. ,కరెంటు సమస్యను పరిష్కరిం చాలి. ఆసుపత్రిలో వైద్యుల కోసం ఐదు గదులు నిర్మాణం చేయాలి. కొత్తగా భవన సముదాయం కడితేనే అది సాధ్యమవుతుంది. పాత భవనం దెబ్బతిన్న కారణంగా దానిని తీసివేసి కొత్త భవనం కట్టాలి. నిధుల లేమి వల్ల ఆసుపత్రిలో కరెంటు పోతే రిపేరు చేయించడానికి రూపాయి లేని పరిస్థితి. ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ సుందర రావు సొంత డబ్బులు పెట్టి పనులు చేయించారు. స్పెషలిస్టులను భర్తీ చేయాలంటే 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలి. పేద ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి అభివద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలి.కొత్త ప్రభుత్వం, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ సమస్యలపై దష్టి సారించాలి.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : 12వ పిఆర్‌సి చైర్మన్‌ను తక్షణమే నియమించాలని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ కష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్ర శేఖరరావుకి వినతిపత్రం అందజేశారు. 2004 ముందు ఉద్యోగంలో చేరిన వారికి మెమో 57 ప్రకారం పాత పెన్షన్ ను అమలు చేయాలని వినతి పత్రం లో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎండి షౌకత్ హుస్సేన్ బి కనకారావు, రాష్ట్ర కార్యదర్శి కే ఏ ఉమామహేశ్వరరావు, గౌరవ అ,ధ్యక్షులు జె లెనిన్ బాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు, ఎన్ శ్రీకాంత్,జిల్లా కార్యవర్గ సభ్యులు పి రవి వరప్రసాద్, కె రంగనాథ్, అబ్దుల్ వహీద్ తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యాన్నంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. సిపియం కృష్ణాజిల్లా కార్యదర్శి వై నరసింహారావు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ నెలలోనే కొంత భాగం వరి కోసి రైతులు అమ్ముకున్నారని, మిగిలి ఉన్న వరి కుప్పలన్నీ ఇటీవల నూరుస్తున్నారన్నారు. కానీ జిల్లాలోని వివిధ ప్రాంతాల ల్లోని ధాన్యం కొనుగోలు చేసిన రైసు మిల్లులన్నీ తమకు కేటాయిం చిన లక్ష్యం పూర్తయినందున తామింకా కొనలేమంటున్నారన్నారు. జిల్లాలో ఇంకా సుమారు 3 లక్షల టన్నుల ధాన్యం వరకు నూర్చి అమ్ముకోవలసి ఉందని, మిల్లర్లు తిరస్కరించడంతో రైతులెంతో ఆందోళన చెందుతున్నారని ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని దళారులు రైతుల్ని మరింత దోపిడి చేసే అవకాశముందన్నారు. కనుక వెంటనే అధికారులు జోక్యం చేసుకొని జిల్లాలో మిగిలిన ఉన్న ధాన్యాన్నంతా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేపించాలని సిపియం కష్ణాజిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు.

మలేషియా యూనివర్సిటీతో ఏఎన్‌యు అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో ని బోటనీ అండ్ మైక్రో బయాలజీ, యూనివర్సిటీ ఆఫ్ మలేషియా కెలిటన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగాధిపతి ఆచార్య కే. మల్లికార్జున తెలిపారు. ఇందులో భాగంగా అధ్యాపక, విద్యార్థుల పరస్పరమార్పిడి, విద్యార్థుల, పరిశోధన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సెమినార్లు, ప్రదర్శనలు, వర్క్ షాపులు, డిగ్రీ, పీజీ స్థాయిలో విద్యార్థుల మార్పిడి, నూతన విద్య కార్యక్రమాల భాగస్వామ్యం వంటి అంశాలపై రెండు యూనివర్సిటీలు కలిసి పని చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధర్ రావు సమక్షంలో మలేషియా యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ అర్లిన బింటి ఆలీ, డాక్టర్ వోవు, డాక్టర్ ఔలీ ఎంవోయి పత్రాలను మార్చుకున్నారు . ఈ సందర్భంలో రెక్టర్ ఆచార్య కే. రత్న షీలామణి, రిజిస్ట్రార్, ఆచార్య జి. సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కే. వీరయ్య ఆచార్య అమత వల్లి, డాక్టర్ మాధవీ, ఆచార్య ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కే .బాబు, డాక్టర్ కే. నాగరాజు, డాక్టర్ కే .విజయ్, డాక్టర్ మిథున్, డాక్టర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న యలవర్తి

క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం

ప్రజాశక్తి - గుడివాడ : ఫొటో, వీడియో గ్రాఫర్ల క్రీడల పట్ల ఆసక్తి చూపించి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్టేడియంలో గుడివాడ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిపిఎల్ 2025 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో సూపర్ స్టార్ విజయం సాధించడంతో గెలుపొందిన జట్లకు యలవర్తి శ్రీనివాసరావు ట్రోఫిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడివాడ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మరీదు హరిబాబు, కేతిరెడ్డి జయవంశీ పవన్, ఎండి జిక్రియ, గుడివాడ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, టోర్నమెంట్ ఆర్గనైజర్ పంచకర్ల కష్ణచైతన్య, కార్యదర్శి కోసూరి అనిల్‌బాబు, కోశాధికారి ఆళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి మోపిదేవి/అవనిగడ్డ : మోపిదేవి లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 3 - 6 తేదీల్లో ఘనంగా జరపనట్లు దేవస్థానం ఉపకమిషనర్ కార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను బుధవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందచేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జరిగే బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఫిబ్రవరి 3వ తేదీ కళ్యాణం, 4వ తేదీ రథోత్సవం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా 6వ తేదీ స్వామివారి కోనేటిలో కల్యాణ మూర్తుల తెప్పోత్సవం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, సీనియర్ అసిస్టెంట్లు బర్మా ప్రసాద్, తోట చెన్నకేశవ, కంప్యూటర్ ఆపరేటర్ పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం క్రికెట్ క్రీడాకారులు 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ లో కష్ణాజిల్లా నుండి అండర్ 19 గర్ల్స్ విభాగంలో తిరుమల శెట్టి నాగచంద్రిక తనదైన క్రీడా ప్రతిభను చూపించి ఆంధ్రప్రదేశ్ టీంకు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్ 14 బాయ్స్ విభాగంలో పుప్పాల శ్రీరామ్ గోపాల్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు సెలెక్ట్ అయ్యారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడా కారులను జిల్లా కలెక్టర్ డీ.కే.బాలాజీ అభినందించారు. క్రీడలలో మరింత రాణించి కష్ణా జిల్లా ప్రతిష్ఠ పెంచాలని ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం అందజేత



ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స జరిగి ఇంటిదగ్గర ఉంటున్న మచిలీ పట్నంలోని పెదఉలిం గిపాలెంకు చెందిన చింతా విజయకుమార్‌కు బండి రామకృష్ణ సాయం బుధవారం అందించారు. బండి రామకృష్ణ, చలమల శెట్టి బాలాజీ ఇరువురు కాలిసి రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన నగర అధ్యక్షులు గడ్డం రాజు, జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి మోకారవి పాల్గొన్నారు.

రోడ్ల వెంట చెత్త వేస్తే జరిమానా

• అనధికార డంపింగ్ ప్రాంతాలపై పర్యవేక్షణ • ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట వ్యర్థ పద్దార్థాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌ను తక్షణమే తొలగించి ఆయా ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేసి వ్యర్థాలను పడవేసే వారిని గుర్తించి జరిమానాలను విధించేందుకు వెనకాడవద్దని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగ్గయ్యపేట మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డ్‌ను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య)తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణ పరిధిలో విలియం పేట సమీపంలో వ్యర్థాలను విడిచిన డంపింగ్ యార్డ్ వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక శాసనసభ్యులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని తక్షణమే ప్రసుత డంపింగ్ యార్డ్ ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించి తరలించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ తొలగింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసి ప్రస్తుతం డంపింగ్ యార్డ్ ప్రదేశాన్ని శుభ్రపరిచి మొక్కలను నాటి ఆహ్లాదకరమైన వాతావారణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ మున్సిపల్ అధికారులు గార్బేజ్ వనరబుల్ పాయింట్స్ (జివిపి)పై ప్రత్యేక దృష్టి పెట్టి వారం రోజులలోపు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తొలగించిన ప్రదేశాల వద్ద సిసి కెమెరాలు పంచాయతీ సిబ్బందితో నిఘా ఉంచి ఎవరైతే అనాధికరంగా వ్యర్థాలను విడిచిపెడుతున్నారో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్ధేశించిన ప్రాంతాలలో మాత్రమే వ్యర్థ పద్ధార్థాలను విడిచిపెట్టాలని హోటల్ యాజమానులకు, వ్యాపారస్తులకు తక్షణమే నోటీసులను అందజేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతాయ్య మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం ద్వారా జగ్గయ్యపేట పట్టణాన్ని సుందరీకరణ చేసేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ జగ్గయ్యపేటను పైలెట్ ప్రాజెక్ట కింద ఆధునీకరించేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహన్, మండల అభివృద్ధి అధికారి జి.నితిన్, ఆర్డీవో బాలకృష్ణ, తాసిల్దార్ మనోహర్, కౌన్సిలర్స్ నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు గ్రామ సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగ్గయ్యపేట మండలంలోని తాగునీరులో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటం వలన కిడ్నీ, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, అందువల్ల కృష్ణాజలాలను శుద్ధిచేసి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నీటిని అందించాలని, సిమెంట్, మరియు కెమికల్ ఫ్యాక్టరీలు ఉండటం వలన గాలి కాలుష్యం, భూగర్భ జలాలు రంగు మారుతున్నాయని, రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేదని, దీనిని ఆసరా చేసుకొని దళారులు యూరియాను ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని ప్రభుత్వం చొరవ తీసుకుని యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలోని అక్షర స్కూల్ లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుని లయన్స్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు అక్షర విద్యాసంస్థల చైర్మన్ గడుపూడి శ్రీరామ్ ప్రారంభించారు. కళ్ళ, దంత, గుండె, కిడ్నీ సంబంధిత విభాగాల సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంపు నందు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం అక్షరా విద్యాసంస్థల చైర్మన్ గడుపూడి శ్రీరామ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ నేపథ్యంలో తమ స్కూల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర విద్యాసంస్థల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తాడేకోరు వెంకటప్పయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు సూదుల సోమశేఖర్, పెద్దినేడి కోటేశ్వరరావు, ముప్పా వరప్రసాద్ మరియు అక్షర స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తొమ్మిదో డివిజన్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పటమటలంక వాటర్ ట్యాంక్ రోడ్డు 9వ డివిజన్‌లో సిపిఎం నాయకులు బుధవారం పర్యటించారు. ప్రతి ఇంటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. నిత్యం డ్రైనేజీ పొంగుతుండటం వలన మురుగు పేరుకుపోతుందని, దోమలు పెరిగాయని, అనారోగ్యం పాలవుతున్నామని తెలిపారు. అండర్ గ్రౌండ్ పైప్ లైన్ డ్రైనేజీ నిర్మాణం జనాభా పెరుగుదలకు తగ్గట్లుగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.వరప్రసాద్, వి.బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో బొబ్బా కృషి ఎనలేనిది

కృష్ణా వర్సిటీ రెక్టార్ బసవేశ్వరరావు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఉమ్మడి కృష్ణాజిల్లాలో చదరంగం ఆటను అభివృద్ధి చేయడంలో ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ వ్యవస్థాపకుడు బొబ్బా రత్నారావు ఎనలేని కృషి చేశారని కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. వయసు మీదపడిన తర్వాత కూడా చదరంగంపై ఉన్న ఆసక్తితో ఎక్కడ పోటీలు జరిగితే అక్కడకు వెళ్లేవారన్నారు. జిల్లాలో చెస్‌ను మరింత అభివద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీని స్థాపించారన్నారు. ఇటీవల రత్నారావు మతి చెందగా, ఆయన కుమారుడు, చెస్ అంతర్జాతీయ కోచ్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీఆర్ బొబ్బా ఆధ్వర్యంలో అకాడమీ అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాసరావు గన్నవరం మండలం ముస్తాబాదలో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌ను కష్ణా యూనివర్సిటీ రెక్టార్ బసవేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. బొబ్బా చెస్ అకాడమీ అధ్యక్షురాలు బొబ్బా రచన, విప్రో కంపెనీ ప్రతినిధి బీ హస్మితతో కలసి బసవేశ్వరరావు రత్నారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. బొబ్బా చెస్ అకాడమీ, ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ శిక్షకులు సుమారు 92 మంది పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ, బొబ్బా రత్నారావు స్ఫూర్తితో ఆయన కుమారుడు వీఆర్ బొబ్బా చెస్ ఆటలో ఆరితేరటమే కాకుండా కోచ్‌గా ఎంతో మంది అంతర్జాతీయ చెస్ క్రీడాకారులను దేశానికి అందించారన్నారు. ఒక దశలో బొబ్బా శిష్యులే అంతర్జాతీయ చదరంగంలో అగ్రగామిగా నిలిచారని గుర్తు చేశారు. విజయవాడ కేంద్రంగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ చెస్ పోటీలను నిర్వహించడంతోపాటు అంతర్జాతీయ కోచ్‌లను తీసుకువచ్చిన ఘనత వీఆర్ బొబ్బాకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో చదరంగం ద్రోణాచార్య అవార్డు గ్రహీత, చదరంగం మహారాణి కోనేరు హంపి తండ్రి కోనేరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాకు న్యాయం చేయండి..!

- **అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి**
- **కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని బాధితురాలి ఆవేదన**



ప్రజాశక్తి-తిరువూరు: మోసపూరితంగా తమ భూములను అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మానసిక వికలాంగుడుతో కలిసి ఓ తల్లి జిల్లా కలెక్టరుకు మొరపెట్టుకున్నా అలకించని దుస్థితి. కింద అధికారులు పట్టించుకోకపోతే కలెక్టర్ అయినా నా మొర విని పరిష్కారం చూపుతారని అనుకు న్న ఆ అభాగ్యురాలికి కన్నీటి చుక్కలే మిగిలాయి. తిరువూరు మండలం, రోలుపడి శివారు సూరవారం గ్రామానికి చెందిన గుడిపూడి నాగ లక్ష్మి కుమారులు సీతారామ వెంకట కృష్ణమోహన్ (మానసిక వికలాంగుడు), హర్ష వర్ధన్‌లు పిల్లలుగా ఉన్నప్పుడు 15 సంవత్సరాల క్రితం నాయనమ్మ గుడిపూడి రాములమ్మ తన కున్న 118/3బిలో 2.80 ఎకరాలు, 118/4ఎలో 2.36 ఎకరాలు (మొత్తం 5.16 ఎకరాలు) భూమి ని 03- 03-2010వ తేదీన తిరువూరు సబ్ రిజి స్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. రిజి స్ట్రేషన్ దస్తావేజులలో రాములమ్మ కుమార్తె విజయకుమారి అప్పట్లో సాక్షిగా సంతకం చేశా రు. అప్పటినుండి ఆభూములలో నాగలక్ష్మి నేటి వరకు కూడా వ్యవసాయం చేసుకుంటూ తన ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. రెవె న్యూ రికార్డుల్లోని 1బిలో, అడంగల్‌లో సీతా రామ వెంకటకష్ణ మోహన్, హర్ష వర్ధన్ పేర్లు నమోదై ఉన్నాయి. పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా వీరి పేర్లతో మీద వచ్చాయి. కృష్ణమోహన్ వికలాంగుడు కావడంతో పూర్తిగా ఎటూ కదల లేని పరిస్థితి. భర్త చనిపోవడం, పిల్లలు పెరిగి పోవడంతో పాటు ఖర్చులు భారం అయ్యాయి. ఇద్దరు కుమారులు మేజర్ల కావడంతో హర్షవర్ధ న్ చదువుకు భూమి ద్వారా లోన్ తీసుకుందామని ఈసీ తీసుకోగా ఆ భూములు నాగలక్ష్మి ఆడపడుచు విజయకుమారి కుమార్తె బండి దివ్యజానకి పేరుతో నూజివీడు సబ్ రిజిస్టార్ కార్యాలయంలో 21-03-2024వ తేదీన రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో నాగలక్ష్మి లబోదిబో అంటున్నారు. సాక్షులు సంతకం కూడా తిరువూరు ప్రాంతానికి చెందినవారు కూడా కారని, ఇది అక్రమ రిజిస్ట్రేషన్, రద్దుచేసి తమకు న్యా యం చేయమని నాగలక్ష్మి తన ఇద్దరు కుమా రులతో కలిసి తిరువూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందనలో అర్జీ పెట్టుకోగా ఇది మా టైంలో జరగలేదు, కాబట్టి నేనేమీ చేయలే నని తహశీల్దార్ చెప్పటంతో నాగలక్ష్మి జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ కూడా స్పం దించకపోవడంతో మాకు న్యాయం చేసేవారు లేరా అని ఆమె ఆ మానసిక వికలాంగుడితో కలిసి బోరున విలపిస్తోంది. 2010 సంవత్సరం లో మైనర్ల పేరుతో రాసిన రిజిస్టర్ దస్తావేజు అమల్లో ఉండగా వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసే హక్కు రావులమ్మ కూడా లేదని, ఈవిషయం చట్టంలో ఉన్నప్పటికీ నూజివీడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని హర్షవర్ధన్ ప్రశ్నిస్తున్నాడు. అక్రమ రిజిస్ట్రేషన్ కాబట్టే తిరువూరులో కాకుండా నూజివీడులో చేయించారని, ఇది స్పష్టంగా తెలుస్తు న్నప్పటికీ అధికారులు పరిశీలించకుండా ఇచ్చిన అర్జీని పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్ కూడా రావటం లేదు

తన పెద్ద కుమారుడు సీతారామ వెంకట కృష్ణ మోహన్ పూర్తిగా మానసిక వికలాంగుడని, ఒక ప్రదేశం నుండి ఇంకో ప్రదేశానికి కదల్లేని పరిస్థితి అని, వికలాంగు పెన్షన్‌ను రద్దు చేశారని నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఐదు ఎకరాల కంటే ఎక్కువ ఆస్తి ఉందని పెన్షన్ రద్దయినట్లు అధికారులు చెప్పారని తెలిపారు. దీని ప్రకారమైన మా అత్త రాములమ్మ తన ఇద్ద రు మనుమళ్లకు ఐదెకరాల 16 సెంట్లు భూమి రిజిస్ట్రేషన్ చేసిన భూమి రెవిన్యూ రికార్డుల్లో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ అధికారు లు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ నివాసంలో మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన బాణావత్ భద్రమ్మ కి అనారోగ్యానికి సంబంధించిన వైద్య ఖర్చులు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 1,30,447 రూపాయల ఎల్‌వోసీ పత్రాన్ని గ్రామ తెలుగుదేశం నాయకులతో కలిసి బుధవారం మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ చేతుల మీదగా అందజేశారు.

అరుంధతి మిర్చితో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని ఆర్లపాడు గ్రామంలో శ్రీనివాసరావు అనే రైతు మిర్చి తోటలో డినోవా సీడ్స్ వారి అరుంధతి 226 మిర్చి రకంపై క్షేత్ర ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డినోవా సీడ్స్ వారి టీఎస్ ఎం కొర్ర రాంబాబు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఎకరాకు 42-50 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వివరించారు. వర్ష భావ పరిస్థితుల్లో సైతం ఈ రకం తట్టుకొని పూత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు కృష్ణమనాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి వర్ధంతి

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక కష్ణవేణి స్కూల్లో బుధవారం గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాషకు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు.



కార్మికులకు యూనిఫాం పంపిణీ



విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ శానిటేషన్, మలేరియా వివిధ విభాగాలలో ఆప్కాస్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సిఐటియు)ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు ఫలితంగా కార్మికులకు యూనిఫామ్ ,టవల్స్, కొబ్బరినూనె, సబ్బులు అందించారనిసిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ 50డివిజన్ సానిటరీ ఇన్స్పెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులకు యూనిఫామ్, సబ్బులు, టవల్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు నుండి కార్మికులకు ఇటువంటి ప్రయోజనం చేకూరలేదని ఇటీవల కాలంలో చేసిన ఆందోళన పోరాటాలు ఫలితంగా ఇవి సాధించడం హర్షించదగిన విషయమని అన్నారు. ఇటువంటి ఆందోళన పోరాటాలు నిర్వహించడం ద్వారానే కార్మికులు తమ హక్కులను సాధించుకో గలరని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ ఓబీ శ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీం పట్నం రింగ్ సెంటర్ ఎప్పటినుంచో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు నిరుపేదల పొట్ట కొట్టొద్దు అంటూ సిఐటియు నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని సాకు తో పేదల వ్యాపారం తీసివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఎట్టి పరిస్థితుల్లో తొలగించాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. చిరు నిరుపేద వీధి వ్యాపారులకు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో పేదలకు అవకాశం కల్పించాలని సిఐటియు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో తోపుడు బండ్లు పూలు పళ్ళు కూరగాయలు అమ్ముకునే నిరుపేద చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు మానవత్వంతో ఆలోచించి వీధి వ్యాపారులకు జీవనాధారం గా ఉన్న తోపుడు బళ్ళు వారికి రింగు సెంటర్లో వెసులుబాటు కల్పించాలని సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధికారులు తోపుడు బండ్లని రింగులో తొలగిస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని అవసరమైతే ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వేతనాలు చెల్లించాలని వినతి

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీ తడి పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె బుధవారంతో 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు పోరంకిలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి కమిషనర్ భవాని ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మున్సిపల్ రాష్ట్ర కోశాధికారి జ్యోతి బోసు మాట్లాడుతూ మూడు నెలలు అవుతున్నా జీతాలు వెయ్యకపోవడం దారుణమని, అలాగే రెండు సంవత్సరాలైనా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఫిబ్రవరిలో సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెళతామని అన్నారు. పెనమలూరు మండలం సిఐటియు నాయకులు ఎస్కే మస్తాన్వలి, పెనమలూరు మండలం సిపిఎం పార్టీ కార్యదర్శి ఎస్కే కాసిం, పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శిఉప్పాడ త్రిమూర్తులు, తాడిగడప మున్సిపాలు సిఐటియు కార్యదర్శి వై సరళ, తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్షులు మధిర ఏడుకొండలు, సిఐటియు నాయకులు దుర్గారావు, వెంకటరెడ్డి, బుజ్జులు, విజయ, బిక్షాలు, సాంబయ్య పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) : మహిళల ఆర్థికాభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. మొవ్వ మండల పరిధిలోని పెదముత్తేవిలో ఖాదీ ఇండస్ట్రి యల్ సహకారంతో ఏర్పాటు చేసిన మహిళలకు కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కుట్టు శిక్ష కేంద్రాన్ని మహిళలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. అనంతరం శాసనసభలు కుమార్ రాజాను, కేకే చౌదరిని మహిళలు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఖాదీ ఇండస్ట్రియల్ చైర్మన్ కేకే చౌదరి, ఖాదీ ఇండస్ట్రియల్ సి ఎస్ ఓ వి.ఆర్. నాయక్, తెలుగుదేశం పార్టీ,మొవ్వ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు , మూడే శివ శంకర్ పాల్గొన్నారు. .



ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజాను సన్మానిస్తున్న దృశ్యం

సిసి రోడ్లు ప్రారంభం : గ్రామీణ రహదారుల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. మొవ్వ మండల పరిధిలోని చినముత్తేవిలో సిసి రోడ్లను బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల హామీలను నెరవే స్తుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని రహదా రుల మరమ్మత్తులను ఇప్పటికే చేపట్టిందని వివరించారు.

పిఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పీఎం సూర్య ఘర్ ఎంతో మంచి పథకమని, ఈ పథకాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో పీఎం సూర్యఘర్ ఇప్పటికే వినియోగించుకుని లబ్ధి పొందుతున్న లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి ఈ పథకం వల్ల వారు పొందిన ప్రయోజనాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకం లబ్ధిదారులు స్థానిక చింతగుంటపాలెం కు చెందిన చోడవరపు ప్రసూన, స్థానిక అరవ గూడెంకు చెందిన లబ్ధిదారుడు కొంపెర్ల సుబ్బారావు ఈ పథకం వల్ల తాము పొందిన ప్రయోజనాలు తెలియజేస్తూ మొదట్లో తమకు కరెంట్ బిల్లులు మూడువేల వరకు వచ్చేవని, అయితే ఈ పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నాక కరెంటు బిల్లు చాలా తగ్గిందని, ఇంటి అవసరాలకు పోను విద్యుత్తు మిగులు ఉండడంవల్ల మిగులు యూనిట్లకు ఆదాయం కూడా లభిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉందని, ఈ పథకం కింద బ్యాంకు రుణ సౌకర్యం కూడా లభిస్తుంది అన్నారు. ఈ పథకం వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కరరావు, సెల్ 7780456319 సంప్రదించాలని తెలిపారు. వెండర్స్ శ్రీధర్, భోగేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల్లో అక్షరాస్యత పెరగాలి

ప్రజాశకి- మోపిదేవి : నేటి సమాజంలో మహిళలు పలు రంగాల్లో రాణిస్తూ ముందుకు దూసుకుపోతున్న తరుణంలో ఇంకా కొంతమంది అక్షరాస్యత లోపించి ఉండడం బాధాకరమని మోపిదేవి ఎంపీపీ రావి దుర్గవాణి పేర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించి శిక్షణ ఇచ్చిన వాలంటీర్లచే ఫిబ్రవరి నెలలోపు అక్షరాస్యత సాధించేలా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉల్లాస్ ప్రోగ్రాంలో భాగంగా ఎంపిక చేసిన 35 మంది శిక్షకులు 350 మందిని ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత విభాగాలలో శిక్షణ ఇచ్చి వారికి కూడా అన్ని విషయాలపై అవగాహన కలిగేలా తీర్చిదిద్దు తారన్నారు. మోపిదేవి మండల అభివద్ధి అధికారి జంగం స్వర్ణభారతి, ఏపీఎం శ్రీనివాసరావు మండల విద్యాశాఖ అధికారి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు





ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని బుధవారం మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులు గొర్రెలు మేకలు కోళ్ల పెంచుకునే రైతులు నిత్యం వైద్య బందంతో సంప్రదింపులు జరుపుతూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చున్నారు. పశువైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు.ఈ కార్యక్ర మంలో మోపిదేవి మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, మోపిదేవి మాజీ సర్పంచ్ సిడిసి చైర్మన్ రావి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - గుడివాడ : గత కొంతకాలంగా గుడివాడ ఆటోనగర్‌లో పేరుకుపోయిన చెత్తను ఐలా కమిషనర్ సాంబశివరావు, గుడివాడ మున్సిపల్ శానిటరీ అధికారి అప్పారావులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ఆటోనగర్‌లో ప్రధాన సమస్య అయిన చెత్త సమస్యను ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దాని ఫలితంగా ఐలా అధికారులు అలాగే మున్సిపల్ అధికారులు వచ్చి చెత్త సమస్యను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బరపల్లి ఆంజనేయులు, ఎండి రషీద్ బేగ్, ఎస్ ఎం మొహిద్దిన్ భాష, గేదెల త్రినాథ్ రాజు, బోయిన వీర్రాజు, రెడ్డి నాగరాజు, కల్వకుంట్ల నాగరాజు, రెబ్బ రాజు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు వెంకట రామ్మూర్తికి నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతిని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో బుధవారం నిర్వహించారు. వెంకట రామమూర్తి చిత్రపటానికి టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు, ఎంపిటిసి బొప్పన భాను పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులరిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: సాగులో పెట్టుబడి వ్యయం తగ్గించి, ఆదాయం పెంచే లక్ష్యంతో పొలం పిలుస్తోంది పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంతో రైతులను చేయిపట్టి నడిపిస్తోందని, ఆరోగ్యానికి భరోసా కల్పించే ప్రకృతి వ్యవసాయం దిశగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రస్తుతం వ్యవసాయం ఎలా ఉంది? సాగుచేస్తున్న పంటలు, ఉపయోగిస్తున్న ఎరువులు, వాటి లభ్యత తదితర వివరాలను రైతులను అడిగారు. తాము సాగు చేస్తున్న శెనగ పంట (జేజీ-11) రకం ఎండిపోయి, దిగుబడి చాలా తగ్గిపోతోందని, ఈ నేపథ్యంలో పంట మార్పిడికి నీటి వసతిని దాములూరు పంపింగ్ స్కీమ్ ద్వారా అందించగలిగితే మొక్కజొన్న, జొన్న వంటి పంటలు వేసుకునేందుకు వీలవుతుందని రైతులు అన్నారు. అదేవిధంగా కర్నూలు ఆధోని శనగ రకం (ఎన్‌బీఈజీ 452) అందించాల్సిందిగా కోరారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పశు గ్రాసం పెంపకం, గోకులం షెడ్స్, కిసాన్ క్రెడిట్ కార్డు, పశు వైద్య శిబిరాల గురించి డా.శైలు మాధురి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భావితరానికి మంచి ఆరోగ్యం అందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. అదేవిధంగా అగ్రి కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి ఇప్పటినుంచే నేల, పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో భాగంగా బుధవారం దాములూరు ఎంపీయూపీ స్కూల్ 8వ తరగతి విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి శనగ పంటను చూపించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీహెచ్ మధుసూదనరావు, మండల వ్యవసాయ అధికారి డి.శైలజ, గ్రామ వ్యవసాయ సహాయకుడు బి.నరేంద్రకుమార్‌నాయక్ పాల్గొన్నారు.




కృష్ణా వర్సిటీ మహిళల క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-మైలవరం: దక్షిణ భారత క్రికెట్ పోటీలకు కృష్ణ యూనివర్సిటీ తరపున పాల్గొని మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కృష్ణ యూనివర్సిటీ టీం మేనేజర్, లక్కీరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళ క్రికెట్ సెలక్షన్స్ స్థానిక లక్కిరెడ్డి హనుమ రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగాయన్నారు. ఈనెల 23 నుంచి యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, కర్ణాటకలో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారన్నారు. కృష్ణ యూనివర్సిటీ టీంకు మేనేజర్ గా మన్నె స్వామి, టీం కెప్టెన్ గా కేవైఎంవి వర్ధిని లు ఉంటారన్నారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 45 టీమ్స్ ఈ పోటీలలో పాల్గొంటాయి అన్నారు. ఈ సందర్భంగా కృష్ణ యూనివర్సిటీ తరపున ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-వత్సవాయి: గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర పరిచిన సంఘటన మండలంలోని పెనుగంచిప్రోలు లింగగూడెం గ్రామాల సరిహద్దుల్లో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన తిరుపతిరావు అనే వ్యక్తి పెనుగంచిప్రోలు నుండి లింగగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినారు దీంతో స్థానికులు అతని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ తరలించారు చికిత్స పొందుతున్నారు. పెనుగంచిప్రోలు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని కొనిజర్ల గ్రామంలో బుధవారం ఏర్పాటైన పశు వైద్య శిబిరంలో 476 పశువులకు చికిత్సలు నిర్వహించి మందులు అందజేసినట్లు పశు వైద్యులు డాక్టర్ అభిలాష్ తెలిపారు. ఇందులో సూడికి రాని గేదెలు, సూడికి రాని, గొర్రెలు, ఆవులు వెరసి 476 గా చెప్పారు. ఆ గ్రామ నాయకులు డి సీతారాం ప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించినట్లు వివరించారు. **కంచికచర్ల:** కంచికచర్ల మండలం కీసరలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం ను సర్పంచ్ పేరం నరసమ్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో 142 పశువులను పరీక్షించి ఆ పశువులు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో 1126 మేకలు, గొర్రెలను పరీక్షించి నట్టల వ్యాధి నివారణకు ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ ఎ నవీన్ కుమార్ పశువులను జంతువులను పరీక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పరిటాల రాము, కలతోటి అజయ్, వేల్పుల వెంకటరావు, మునగ శీను, కుక్కల శీను తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం పశు వులకు, జీవాలకు ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు పశువైద్య అధికారిణి శ్వేత తెలి పారు. పది పశువులకు సాధరణ వైద్యం, ఐదు పశు వులకు కృత్రిమ గర్భధారణ, 400 గొర్రెలకు మేక లకు నట్టలమందు వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు నెక్కడపు శ్రీనివాసరావు, పాల కేంద్రం అధ్యక్షులు గురం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు ఘన స్వాగతం



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ గేమ్స్, ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్ 14 బాల,బాలికల జాతీయ సెపక్ తక్రా పోటీల్లో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల జట్లు బుధవారం నగరానికి చేరుకున్నాయి.ఆంధ్ర ప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు జట్లు బుధవారం నగరానికి చేరుకున్నాయి. ఈ రాష్ట్రాల జట్లుకు రైల్వే స్టేషన్ లో స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు సంప్రదాయ పద్ధతిలో హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.పోటీల్లో పాల్గొనే జట్లుకు స్థానిక హోటళ్లలో నిర్వాహకులు బస ఏర్పాటు చేశారు.ఈ జాతీయ పోటీల్లో 12 జట్లుకు హోటళ్లలో 60 కు పైగా గదులను ఏర్పాటు చేసారు.పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు, రాష్ట్ర పాఠశాల క్రీడ సమైక్య కార్యదర్శి భానుమూర్తి రాజు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రానికి చేరుకున్న జట్లు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (బాలల) మైదానంలో సాధన చేశాయి.పోటీలు కోసం నాలుగు కోర్టులు సిద్ధం చేశామని, రెండు కోర్టులుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశామని,గురువారం ఉదయం నుంచి జట్ల రిజిస్ట్రేషన్ ,ధ్రువపత్రాల పరిశీలన జరుగుతాయని పోటీల నిర్వహణ కార్యదర్శి సింహాద్రి రమేష్ తెలిపారు.జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ జట్టు వివరాలను జిల్లా పాఠశాల క్రీడ సమైక్య కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు.బాలుర జట్టుకు మహమ్మద్ జాకీర్ అహ్మద్ నాయకత్వం వహిస్తుండగా ఎస్.కార్తీక్, ఎం.రేవంత్, జి.సందీప్, కె.అభిలాష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బాలికల జట్టుకు వి.కావ్య నాయకత్వం వహిస్తుండగా ఎం.డి.రెహేనుమ, కె.లావణ్య, ఎన్.కవిత, ఎం.భానుప్రియ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కోచ్‌లుగా టి.రాజేంద్ర కుమార్, కె.నాగేంద్ర వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోనిమోటర్ వెహికల్ కార్యాలయం నుండి పట్టణ ప్రధాన కూడళ్లలో బైక్ ర్యాలీని మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ యందియన్ రాజు, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహనాలను నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదని, ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు.

సమస్యలపై వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిలర్, పట్టణ వైసిపి మనోహర్ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామ్మోహన్‌రావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అక్రమ లేఔట్లు వల్ల సుమారు 10 కోట్ల రూపాయల విలువ గల స్థలాలను మున్సిపాలిటీ నష్టపోయిందని, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని, విలియంపేటలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రిలో తనిఖీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట



పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌ను బుధవారం ఆర్డీవో బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్లో ఉన్న అన్ని వైద్య విభాగాలను పరిశీలించి వారు అందిస్తున్న సేవలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మరిన్ని ఉత్తమమైన సేవలు అందించాలని డాక్టర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, హాస్పటల్ నందు పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలల నుండి జీతం రాకపోవడంతో ఉన్నత అధికారులతో మాట్లాడి వారికి త్వరిత గతిన జీతాలు వచ్చే విధంగా చూడాలని సూపరింటెండెంట్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మనోహర్, ఆర్ఐ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళపై దాడి హేయం : వైసిపి


బాధితురాలిని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఎ.కొండూరు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గిరిజన మహిళపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ అన్నారు. బుధవారం గోపాలపురం గ్రామంలో ఎమ్మెల్యే దాడి వల్ల ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన భూక్య చంటిని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులను ఏదోరకంగా ఇబ్బందులు పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. భూక్య చంటి దాడి ఘటనకు ఏ కొండూరు పోలీస్ స్టేషన్లో కొలికపుడి శ్రీనివాస్‌పై బాధితులు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయకుండా ఎందుకు ఆక్షేపిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు జడ్పిటిసి, భూక్య గన్యా, తిరువూరు జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి, విస్సన్నపేట జడ్పిటిసి లోకేశ్వర్ రెడ్డి, భూక్యరాణి, గోపాలపురం సర్పంచ్ కోలా శీను, కోడూరు సర్పంచ్ తెళ్లూరి సురేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తిరువూరు: భూక్యా చంటి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం గోపాలపురంలో చంటి కుటుం బాన్ని పరామర్శించి ఎమ్మెల్యే దాడికి సంబంధిం చిన వివరాలను అడిగి తెలుసుకున్నట్లు నాయక్ చెప్పారు. అన్నదమ్ముల మధ్య స్థలం వివాదం పరిష్కారానికి పోలీసులు, అధికారులు చర్యలు తీసుకుంటున్న క్రమంలో రోడ్డు వేశారని, ఈ విషయంలో ఆ గ్రామంలోని టిడిపి నాయకుడు చంటి కుటుంబంపై తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఎమ్మెల్యే ఏం జరిగిందో తెలుసుకోకుండా చంటి కుటుంబంపై దాడి చేయడం జరిగిందని వివరించారు. చంటి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.